మినీ మేడారానికి పటిష్ట భద్రత

- ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్
- అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు, ఫిబ్రవరి11(నమస్తేతెలంగాణ) : మినీ మేడారం జాతర సందర్భంగా భక్తులకు రక్షణ కల్పించేందుకు పోలీస్‌శాఖ ద్వారా పటిష్ట భద్రత ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆయన పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పోలీస్ శాఖ ద్వారా వెయ్యి మంది పోలీస్ అధికారులకు జాతర విధులు కేటాయించినట్లు తెలిపారు. బందోబస్తు కోసం ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లో పనిచేసే పోలీస్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ట్రాఫిక్ కంట్రోల్‌లో భాగంగా భక్తుల సౌకర్యార్థం డైవర్షన్, పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. బైక్, పెట్రోలింగ్ పార్కులను ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయనున్నట్లు తెలిపారు. క్యూలైన్‌ల వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. గద్దెలు, జంపన్నవాగు వద్ద దొంగతనాలు నివారించేందుకు మఫ్టీలో పోలీస్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వీవీఐపీలు జాతరకు వచ్చే అవకాశం ఉన్నందున వారికి బందోబస్తు కల్పించేందుకు అధికారులను నియమించినట్లు తెలిపారు. భక్తులు సైతం పోలీస్ అధికారుల సూచనలు పాటిస్తూ తల్లుల దర్శనాన్ని ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఓఎస్డీ గీతే మహేశ్ బాబా సాహెబ్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు కిశోర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులు అధికారుల సూచనలు పాటించాలి : కలెక్టర్

ములుగు రూరల్ : మేడారంలో నేటి(బుధవారం) నుంచి 3రోజులపాటు జరిగే మినీమేడారం జాతరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసిందని, జాతరకు వచ్చే భక్తులు అధికారుల సూచనలు పాటిస్తూ అమ్మవార్లను దర్శించుకోవాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బందిని నియమించామన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతోపాటు భక్తులు జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించేందుకు నల్లాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జాతరలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏటూరునాగారం మండలం కొండాయి, ఐలాపూర్ గ్రామాల్లో జరిగే మినీ మేడారం జాతరకు సైతం తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రత్యేక బస్సులు సమకూర్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కొండాయిలో జాతర ప్రారంభం

వడ్డెల కాళ్లకు పసుపు రాస్తున్న మహిళలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11 : మండలంలోని కొండాయిలో గోవింద రాజులు, నాగులమ్మ, సారలమ్మ జాతరను మంగళవారం నుంచి ప్రారంభించారు. గద్దెల ప్రాంగణంలో పుట్టమన్ను కోసం అడవికి వెళ్లే వడ్డెల కాళ్లకు పసుపు పూసి పారాణి రాశారు. గ్రామస్తులు, పూజారులు అడవిలోని పుట్టమట్టి, జంపన్న వాగు నుంచి నీటిని బిందెల్లో తెచ్చి నాగులమ్మ ఆలయాన్ని శుద్ధి చేశారు. బుధవారం నుంచి జాతర ప్రారంభానికి ముందు రోజు చేపట్టాల్సిన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. డోలు వాయిద్యాల నడుమ బాలికలు నీటి బిందెలతో నాగులమ్మ ఆలయ ఆవరణలోకి రాగా, పూజారులు గోవర్ధన్, రాజారాం, రఘు, మహిళలు పుట్టమన్నుతో వచ్చారు. అనంతరం పూజించి పసుపు, కుంకుమలతో అలంకరించారు. అదేవిధంగా కొండాయిలోని గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మ గద్దెలను అలంకరించారు. బుధవారం నుంచి జాతర ప్రారంభం కానున్నట్లు పూజారులు తెలిపారు.

బుధవారం దొడ్ల నుంచి సారలమ్మ కొండాయికి వస్తుందని, అక్కడ పూజలు చేపట్టిన అనంతరం గద్దెలపై ప్రతిష్ఠించనున్నట్లు పూజారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఐటీడీఏ తరపున తాగునీటి వసతి, విద్యుద్దీపాలు, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పించారు.

నెమళ్లగుట్ట జాతర ప్రారంభం

మంగపేట, ఫిబ్రవరి 11 : మండలంలోని జబ్బోనిగూడెం శివారులోని నెమళ్లగుట్టపై మంగళవారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభమైంది. జాతర ప్రధాన పూజారి కుంట్ల నరేశ్ ఆధ్వర్యంలో గుడిలోని సమ్మక్క, సారలమ్మ ప్రతిమలను శుద్ధిచేసి పూజలు చేశారు. రాత్రి డోలు వాయిద్యాల నడుమ మండమెలిగె తంతు నిర్వహించారు. నేడు(బుధవారం) అమ్మవారి ఊరేగింపు, జోగు తిరగడం, లక్ష్మీదేవర ఎదుర్కోలు, మహా అన్నదానం తదితర కార్యక్రమాలుంటాయని ప్రధాన పూజారి తెలిపారు. పూజారుల బృందం కుంట్ల ముత్తయ్య, వెంకటమ్మ, కుంట్ల సదయ్య, సంధ్య, కుంట్ల భాస్కర్, ఝాన్సీ, గౌతమి, సమాన్య, సాక్షిత్, వంశీ, మడె బుచ్చక్క తదితరులు పాల్గొన్నారు.

కోతలు కోశారు.. కొంపలు ముంచారు

- కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- టేకుమట్లలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం అడ్డగోలు కోతలు కోసి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ఆనందంగా జీవించారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అట కెక్కించారని తెలిపారు. పల్లెల్లో ఎవరిని కదిలించినా కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని బాధపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. మండలంలో అక్రమంగా ఇసుక తోడడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు కేసులు పెట్టివేదిస్తున్నారన్నారు. మానేరు, చలివాగు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతుంటే, డీబీఎం 38 కెనాల్ ద్వారా నీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యాడన్నారు. ఇసుకాసురుల కడుపు నింపడంలో మాత్రం సఫలం అయ్యాడని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో మే నెలలో కూడా కెనాల్ ద్వారా నీరు తెచ్చి చెరువులు నింపామని గండ్ర గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రభుత్వం, అధికారులు బాధ్యతగా పనిచేస్తారని, లే కుంటే ప్రజలు అభివృద్ధికి నోచుకోకుండా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుం దన్నారు. సమావేశం లో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బందెల స్నేహలతా నరేశ్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, బీఆర్ఎ స్ మండల అధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణగౌడ్, మం డల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు బొడ్డు సదానందం, కొలిపాక రాజయ్య, సుధాకర్, ఆది రఘు, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, నేరేళ్ల శ్రీను, ఉద్దమారి మహేశ్, చదువు మహేందర్‌రెడ్డి, నల్ల బెల్లి ర వీందర్, దొడ్ల కోటి, తోడెటి రవీందర్, ఉమేందర్‌రావు, అక్రమ్, లక్ష్మణ్, నర్సింగరావు, సమ్మయ్య, రమేశ్, లక్ష్మ య్య, భాగ్యలక్ష్మి, స్వామి, రాజు, శివ, మల్లేశ్ పాల్గొన్నారు.

ఇసుక దందా కోసమే వాగులు ఎండబెడుతున్నరు..

గువ్వాడి శివ

చలివాగు, మానేరు వాగు పరీవాహక ప్రాంతంలో రైతులు వందలాది ఎకరాల్లో వరి సాగు చేస్తే, ఇప్పుడు రెండు వాగులు ఎండిపోయాయి. ఈ రెండు వాగుల్లోంచి దసరా నుంచి రికాం లేకుండా ఇసుక తరలిస్తున్నారు. వాగులోని బోర్లు నీళ్లులేక ఎట్టిపోతున్నాయి. కెనాల్ నీళ్లు వస్తలేవు. నీళ్లు వస్తే ఎక్కడ ఇసుక దందా ఆగుతదో అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నీళ్లు ఇవ్వకుండా రైతుల పొట్టకొట్టి, అక్రమార్కుల జేబులు నింపుతున్నడు. దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని ఆరెపల్లి రైతు గువ్వాడి శివ అన్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కల్పించుకుని మాయ మాటలకు రైతులు మోసపోయారని, మళ్లీమోసపోకుండా ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వాగుల్లోకి కెనాల్ ద్వారా నీరు వచ్చే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని రైతుకు హామీ ఇచ్చారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : కలెక్టర్ దివాకర

ములుగురూరల్, ఫిబ్రవరి 11 : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా త్వరలో చేపట్టే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్వోలు, ఏఆర్‌వోలకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా అధికారులు సంసిద్ధులు కావాలని అన్నారు. జిల్లాలో 87ఎంపీటీసీలు, 10జడ్పీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచి నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా ముద్రించాలని అన్నారు. నామినేషన్‌ల స్వీకరణ, విత్‌డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేస్తూ తగిన ఆధారాలతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్‌తోపాటు కౌంటింగ్ ప్రక్రియను సైతం సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

10లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలి

10వ తరగతి వార్షిక పరీక్షల్లో ములుగు జిల్లాకు చెందిన విద్యార్థులకు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాణినితో కలిసి కలెక్టర్ మంగళవారం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి సూర్యనారాయణ, ఏసీజీఈ అప్పని జయదేవ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళ లకు అవగాహన

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 11 : ఎదిర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఆరోగ్య మహిళా క్లినిక్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి స్నేహ మాట్లాడుతూ మహిళలకు వ్యక్తిగత ఆరోగ్య సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్ కల్యాణ్, ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిహారం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రైతులకు పరిహారం చెల్లిస్తామని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని ఇస్పిపేట, రంగాపురం గ్రామాల్లో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల భూములను ఎన్‌హెచ్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు నూతనంగా నిర్మిస్తున్న నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి, ఇస్పి పేట, రంగాపూర్, మేదరమెట్ల, గ్రామాల్లో సుమారు 8.78కిలో మీటర్ల మేర వెళ్తున్నందున భూ సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. రంగాపూర్ గ్రామ శివారులో 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న రెస్ట్ పాయింట్ (పార్కింగ్ ఏరియా)ను ప్రభుత్వ భూమి ఉన్న చోటుకు మార్చాలని రైతులు కలెక్టర్‌ను కోరగా నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి మార్చడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. తమ పంటలు తీసుకున్నాక పనులు మొదలు పెట్టాలని కోరగా తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ రైతులకు చెప్పారు. అలాగే స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు, వంటగది, డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి తిన్నారు. ప్రతి రోజూ భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం భోజనాన్ని ప్రత్యేకాధికారి, వార్డెన్ తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రోగుల హాజరు నమోదు, ల్యాబ్, ఫార్మసీ, వార్డులను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది రావొద్దని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రవి, నేషనల్ హైవే పీడీ దుర్గాప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ సునీల్, తహసీల్దార్ సునీత, వైద్యాధికారి నాగరాణి, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శారద, ఏటీపీలు ప్రభాకర్, అపర్ణ ఉన్నారు.

డాక్టర్ తిట్టాడని గడ్డి మందు తాగిన యువకుడు

మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలింపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 11 : డాక్టర్ తిట్టడంతో యువకుడు గడ్డి మందు తాగిన ఘటన భూపాలపల్లి మండలం గొర్లవేడులో జరిగింది. బాధితుడి తల్లిదండ్రులు, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సింగవేణి మహేశ్ పట్టణంలోని సురక్ష ఆసుపత్రిలో వార్డుబాయ్, టెక్నీషియన్‌గా రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. గత వారం కాటారం గ్రామానికి చెందిన సమ్మిరెడ్డి పక్షవాతంతో దవాఖానకు రాగా అతడికి మహేష్ మూత్రం పైపు వేయడంతో బ్లీడింగ్ అయింది. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం సమ్మిరెడ్డిని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు పంపించారు. చికిత్స అనంతరం సదరు ఆస్పత్రి డాక్టర్ రామ్‌ప్రసాద్‌రెడ్డిని ట్రీట్‌మెంట్ కోసం వెచ్చించిన డబ్బులు ఇవ్వాలని సమ్మిరెడ్డి ఒత్తిడి తీసుకురావడంతో రూ.23 వేలు ఇచ్చారు. మంగళవారం ఉదయం డ్యూటీకి వచ్చిన మహేశ్‌ను రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుచుకొని 'నీవు పైపు వేయడంతో బ్లీడింగ్ వచ్చిందని, ఆ డబ్బులు నువ్వే ఇవ్వాలని, లేకుంటే కేసు పెడుతానని బెదిరించాడు. దీంతో మహేష్ ఇంటికి వెళ్లి సాయంత్రం 4 గంటల సమయంలో గడ్డి మందు తాగాడు. అతడిని వెంటనే సురక్ష ఆసుపత్రి తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స చేసి వరంగల్‌కు అంబులెన్స్‌లో తరలించారు. డాక్టర్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

చింతకాని సబ్ సెంటర్‌లో తనిఖీలు

వైద్యులతో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న బృందం

కాటారం, ఫిబ్రవరి 11 : మండలంలోని చింతకాని సబ్ సెంటర్‌లో ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) జాతీయ బృందం అధికారులు మంగళవారం వర్చువల్‌గా తనిఖీలు చేశారు. డాక్టర్ స్వామి కపాడియా, డాక్టర్ శరణప్ప గంగిర్ల బృందం సబ్ సెంటర్ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలను ఆన్‌లైన్‌లో అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఇమ్యునైజేషన్‌పై లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నేషనల్ టీం అడిగిన వివరాలన్నీ ఎన్‌క్యూఏఎస్ ప్రోగ్రాం అధికారి చిరంజీవి ఆన్‌లైన్‌లో వారికి చూపించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రమోద్, పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీలు గీత, ప్రియాంక, హెచ్ఎస్‌లు పద్మావతి, సరళ, హెచ్‌ఈవో స్వామి, హెచ్ఎలు రాజు, సమ్మయ్య, ఏఎన్ఎంలు లక్ష్మి, మనోరమ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11 : ములుగులో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించి పక్కా భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ కోరారు. మండలకేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ మూడో జిల్లా మహాసభలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని మొత్తంగా ప్రైవేట్ కార్పొరేట్ చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. గిరిజన యూనివర్సిటీకి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుంటే భవనాలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించండంలో నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా, మండల నాయకులు టీఎల్ రవి, సాదు రాకేశ్, మోర లక్ష్మణ్, రవితేజ, బాలేశ్వర్, భరత్, రంజిత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం

కాటారం, ఫిబ్రవరి 11 : స్థానిక సంస్థల ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను సిద్ధం చేసి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో బాబు తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాలపై గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు, సలహాలు సూచనలు ఉంటే తెలుపాలని కోరారు. ఎంపీవో వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి షఫీర్‌ఖాన్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11 : పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీవో కుమార్ కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ 2025 ఎన్నికల నిమిత్తం ఎంపీటీసీల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం మండలపరిషత్ కార్యాలయం వద్ద నోటీసు బోర్డుపై అంటించినట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఆయా పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 15న తుది పోలింగ్ కేంద్రాల ప్రచురణ చేపట్టనున్నట్లు తెలిపారు.

నిధులు కేటాయించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11 : ఐటీడీఏలకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి మంగళవారం ఓప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ గిరిజనుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేకాధికారులను నియమించి గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు.

ఎన్యుమరేటర్లకు సర్వే డబ్బులు చెల్లించాలి

వెంకటాపూర్, ఫిబ్రవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యుమరేటర్లకు ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పెండ్యాల సలేంద్రం, తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ సర్వర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి రవీందర్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే ములుగు జిల్లా సర్వేలో మొదటి స్థానంలో నిలిచినప్పటికీ ఇంతవరకు వారికి డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. వెంటనే డబ్బులు చెల్లించాలన్నారు.

నేడు కాళేశ్వరంలో 'గోదావరి హారతి'

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 11 : కాళేశ్వరంలో ప్రతి నెల పౌర్ణమి రోజు ఇచ్చే 'గోదావరి హారతి' మహోత్సవాన్ని నేడు సాయంత్రం 5గంటలకు నిర్వహించనున్నట్లు ఈవో మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయం నుంచి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో గోదావరి నది తీరానికి వెళ్లి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 11 : నిత్యం మద్యం సేవించడంపై భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిరుతపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్చు లకు చందర్‌రావు(40) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య రాణి చాలా సార్లు మద్యం తాగవద్దని చెప్పినప్పటికి వినలేదు. సోమవారం ఉదయం మద్యం సేవించగా భార్య మందలించింది. మొక్కజొన్నకు నీళ్లు పెట్టే విషయంలో ఆమెతో గొడవపడ్డాడు. మనస్తాపం చెందిన చందర్‌రావు ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగు మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం ములుగు దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కాగా, మృతిడి తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

తాడ్వాయి, ఫిబ్రవరి 11 : వెనుక నుంచి బైక్ ఢీకొట్టగా మండలంలోని నర్సాపురానికి చెందిన గొరై సమ్మక్క(55)అనే మహిళ మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతురాలి అల్లుడు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపురానికి చెందిన సమ్మక్క పొలం పనులు చేసేందుకు కూలీకి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగివస్తున్నది. ఈ క్రమంలో బీరెల్లి నుంచి కాటాపురానికి బైక్‌పై వస్తున్న ముండ్రాతి శ్రీనివాస్ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్ కారణంగా ముందు వెళ్తున్న సమ్మక్కను గమనించకపోవడంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో సమ్మక్క తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు 108 ద్వారా ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు ములుగు ఆస్పత్రికి తరలించగా సమ్మక్క అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది. మృతురాలి అల్లుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బావిలో పడి ఒకరు..

టేకుమట్ల, ఫిబ్రవరి 11 : బావిలో దూకి బజ్జీల వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని వెలిశాలలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం కైలాపూర్ గ్రామానికి చెందిన చింతల రవి(48), టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్(వీ) గ్రామానికి చెందిన సునీతను వివాహం చేసుకున్నాడు. 15 ఏండ్ల క్రితం వెలిశాలకు వచ్చి బజ్జీల బండి నడుపుకుంటూ సొంత ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాడు. తరుచు భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో పోలీస్ స్టేషన్ వరకు వెళ్లారు. దీంతో రవి భార్య పుట్టింటికి వెళ్లడంతో ఈ నెల 8 నుంచి రవి కనపడకుండా పోయాడు. వెలిశాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త స్వామ